నకిరేకల్ 100 పడకల ఆస్పత్రికి 'గాంధీ హాస్పిటల్' గా నామకరణం : ఎమ్మెల్యే వేముల

నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

నకిరేకల్, మార్చి 15 : నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మితమవుతున్న 100 పడకల ఆస్పత్రికి గాంధీ హాస్పిటల్‌గా నామకరణం చేస్తామని, హాస్పిటల్ ముందు భాగంలో అద్భుతమైన గాంధీ విగ్రహం ఏర్పాటు చేసి ఆర్యవైశ్యుల కీర్తిని పెంచుతామని ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ఆ సంఘ భవనంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే వీరేశాన్ని సన్మానించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నకిరేకల్ సెంటర్‌లో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిరేకల్ మున్సిపాలిటీ ఆదాయం పెంచే మార్గాలను అన్వేషిస్తున్నామని, పట్టణంలో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు సీఎంతో మాట్లాడానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, మండల, పట్టణాధ్యక్షులు బ్రహ్మదేవర రామ్మోహన్, వీర్లపాటి నర్సింహారావు, యువజన విభాగం అధ్యక్షులు బెల్దె శ్రీను, మహిళా విభాగం అధ్యక్షురాలు సోమ కృష్ణవేణి, జిల్లా నాయకులు సోమ యాదగిరి, నాయకులు బ్రహ్మదేవర రమేశ్, రఘునాథ్ పాల్గొన్నారు.

కనులపండువగా కుంకుమార్చన

శాలిగౌరారం: వల్లాల శివాలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

శాలిగౌరారం, మార్చి 15 : మండలంలోని వల్లాల పార్వతీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామికి ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, ఎంపీటీసీ మాదగోని కవిత, ధర్మకర్తలు వావిలాల రామలింగయ్య శర్మ, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

త్వరలో బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును పూర్తి చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

నల్లగొండ/నీలగిరి/నార్కట్‌పల్లి, మార్చి 15 : ప్రభుత్వం ద్వారా రూ. 250 కోట్లు మంజూరయ్యాయని, వచ్చే వర్షాకాలం నాటికి బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ నుంచి బ్రాహ్మణ వెల్లెంల, బ్రాహ్మణ వెల్లెంల నుంచి చిట్యాల వరకు రూ. 67 కోట్లతో చేపట్టనున్న నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు శుక్రవారం ఆయన బ్రాహ్మణ వెల్లెంలలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అయిన తర్వాత మొదటి సారిగా పుట్టిన ఊరు బ్రాహ్మణ వెల్లెంలకు రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో సొంత నిధులతో 3 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని తెలిపారు. బ్రాహ్మణ వెల్లెంల గ్రామాన్ని సోలార్ మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వ పనులు పునరుద్ధరించాలని, నార్కట్‌పల్లి డిపోను పునఃప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆర్డీఓ రవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఐటీసీ ప్రతినిధి ఉమాకాంత్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజేశ్, డీఈ సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ ఉమేశ్, తాసీల్దార్ వెంకటరమణ, బత్తుల ఊషయ్య, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, భరత్ పాల్గొన్నారు.

వరిలో కాండం తొలిచే పురుగు నివారణ చర్యలు తీసుకోవాలి

- డీఏఓ శ్రవణ్ కుమార్

గుర్రంపోడులో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న డీఏఓ శ్రవణ్ కుమార్

గుర్రంపోడ్, మార్చి 15 : మండలంలోని తేనేపల్లి గ్రామంలో వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి గింజ పాలుపోసుకునే దశ నుంచి గింజ ఏర్పడే దశలో ఉన్నందున కాండ తొలుచు పురుగు ఆశిస్తున్నట్లు గమనించామని తెలిపారు. దీని నివారణకు కార్టిప్ హైపోక్లోరైడ్ 50 ఎస్పీ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని లేదా క్లోరోత్రినోప్రోల్ 0.4 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుత దశలో అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోన్ 75ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, ఎరువులను తప్పనిసరిగా ఈ పాస్ ద్వారానే విక్రయించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి ఉన్నారు.

ఇండ్ల స్థలాల కోసం పరిశీలన

ముదుదండ్ల గ్రామ శివారులో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ శ్రీనివాస్

చందంపేట, మార్చి 15 : ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలు అందించడంలో భాగంగా తాసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ముదుదండ్లలో స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ పోల్యానాయక్‌తండాకు చెందిన పలువురు కలెక్టర్, ఆర్డీఓకు దరఖాస్తు చేసుకోవడంతో వారి ఆదేశాల మేరకు మూడుదండ్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 168లో ఆరు ఎకరాల స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ నజీర్, మాజీ సర్పంచ్ రామ్లి బాలాజీనాయక్, నిల్యానాయక్, గోల్యానాయక్, మల్యానాయక్, కిషన్‌బావోజీ, రవీందర్, శంకర్ ఉన్నారు.

దైనందిన జీవితానికి దిక్సూచి పంచాంగం

- ఉమ్మడి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్

పంచాంగం ఆవిష్కరిస్తున్న ఉమ్మడి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్

రామగిరి, మార్చి 15 : దైనందిన జీవితంలో కాలాన్ని నిర్ణయించడంతో పాటు పలు కార్యక్రమాలను ముందే నిర్ణయించుకోవడంలో పంచాంగం దిక్సూచిలా ఎంతో ఉపయోగపడుతుందని ఉమ్మడి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్ అన్నారు. తెలంగాణ ధూప, దీప నైవేద్య అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా వైదిక బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర ఉత్తమ అర్చక అవార్డు గ్రహీత పెన్నామోహన శర్మ నిర్వహణలో బ్రహ్మశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి రచించిన 'శ్రీక్రోధి' నామ సంవత్సరం పంచాంగాన్ని శుక్రవారం నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణులు, బ్రాహ్మణ సంఘాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ ఆర్డీఓగా శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ, మార్చి 15 : మిర్యాలగూడ ఆర్డీఓగా జి.శ్రీనివాస్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఆర్డీఓ బి.చెన్నయ్య జగిత్యాల భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాలలో పనిచేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రావు మిర్యాలగూడకు బదిలీపై వచ్చారు. ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శాలిగౌరారం, మార్చి 15 : మండలంలోని రామగిరి, అడ్లూర్ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు అన్నెబోయిన సుధాకర్, చామల వెంకటరమణారెడ్డి, భూపతి అంజయ్యగౌడ్, నిమ్మల మధు గౌడ్, నిమ్మల కృష్ణమూర్తి గౌడ్, ఆకుల శ్రీనివాస్, లొడంగి మహేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చందంపేట, మార్చి 15 : మండలంలోని ముదుదండ్ల గ్రామంలో కలకొండ వెంకటమ్మ ఇటీవల మరణించడంతో శుక్రవారం ఆమె భర్త వెంకటాచారికి బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు యాసాని రాజవర్ధన్ రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయన వెంట ఇప్ప గోపాల్‌రెడ్డి, జక్కుల జంగయ్య, యాదయ్య, మురళి, దశరథం ఉన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం : పీవైఎల్

నకిరేకల్, మార్చి15 : భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదామని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దేశం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన యువ కిశోరాల 93వ వర్ధంతి పోస్టర్‌ను నకిరేకల్ పట్టణంలో శుక్రవారం పీడీఎస్‌యూ–పీవైఎల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు వెంకన్న, పిట్టల అనిల్, సురేశ్, రాజు, శంకర్, ప్రదీప్, ఏసు, నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హాలియా, మార్చి15 : హాలియాలో అల్వినా ఫౌండేషన్ చైర్మన్ బహదూర్ షావలీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ జనార్దన్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ జంగయ్య, అలుగుల లక్ష్మిరెడ్డి, గొట్టిముక్కుల నరేశ్, నాంపల్లి రవికుమార్, అజ్గర్, లల్లూ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి, మార్చి 15 : మండలంలోని చెన్నమనేనిపల్లి గ్రామ వివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంమ్మూర్తి తెలిపారు. ఆన్‌లైన్ చేయకుండా ప్రభుత్వ నిబంధనలు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేస్తే కేసు నమోదుతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు.. నలుగురిపై కేసు

చందంపేట, మార్చి 15 : మండలంలోని బుడ్డోనితండా గ్రామానికి చెందిన నలుగురు గుప్త నిధుల కోసం నల్లమల అటవీ ప్రాంతంలో తవ్వకాలు చేపడుతున్నారన్న సమాచారం మేరకు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. శుక్రవారం తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు. తవ్వకాలు జరిపిన ప్రాంతంలో ఆంజనేయస్వామి విగ్రహం వందల సంవత్సరాల నుంచి ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కారు, పల్సర్ బైక్‌తో పాటు పనిముట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మాదిగ ఉప కులాల సదస్సును విజయవంతం చేయాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చిట్యాల, మార్చి 15 : ఈ నెల 17న నల్లగొండ పట్టణంలో జరిగే మాదిగ ఉప కులాల సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చిట్యాల మున్సిపల్ పట్టణంలోని మహనీయుల సెంటర్‌లో కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేడి పాపన్న, మంద వెంకన్న, పోలేపల్లి సత్యనారాయణ, పోకల ఉదయ్, శ్రీకాంత్, జిట్టా స్వామి, చింత సురేశ్, దిలీప్, అశోక్, వెంకన్న, ప్రకాశ్ పాల్గొన్నారు.

చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి

నీలగిరి, మార్చి15 : వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. నల్లగొండ ప్రాజెక్టు చర్లపల్లి సెక్టార్‌లో శుక్రవారం ఆయాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున చిన్నారులు దాహం సమస్యతో ఉంటారని, వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. దీనికి తోడు టీచర్ల కుటుంబ సర్వే కారణంగా ఏరియాలో ఉంటారని, కేంద్రాల నిర్వహణ ఆయాలు చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆయాలు సైదమ్మ, పద్మ, జ్యోతి, సుకన్య, రాణి, యశోద పాల్గొన్నారు.

మహిళల భాగస్వామ్యంతోనే సంపూర్ణ అభివృద్ధి

- ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి

మాట్లాడుతున్న అల్వాల రవి

రామగిరి, మార్చి 15 : అన్ని రంగాల్లో మహిళ భాగస్వామ్యంతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. ఎంజీయూ ఇంటర్నల్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తరతరాలుగా మహిళలు సామాజిక కట్టుబాట్లకు, హింసకు దోపిడీకి బలవుతూ క్రమంగా అభివృద్ధి పథంలో సాగుతున్నప్పటికీ మరింత భాగస్వామ్యం పెరుగాలన్నారు. ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి మాట్లాడుతూ సామాజిక మార్పులో మహిళ విద్య కీలకమన్నారు. గ్రామ్య రిసోర్స్ సెంటర్ సంచాలకులు సుమలత మాట్లాడుతూ దేశంలో మహిళల పట్ల జరుగుతున్న వివక్ష, హింస, దోపిడీని అరికట్టేందుకు అవగాహన, రక్షణ కోసం సఖి సెంటర్లు ఉద్భవించాయని తెలిపారు. ఇంటర్నల్ కమిటీ చైర్‌పర్సన్ బి. సరిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సఖి సెంటర్ ప్రతినిధులు సునీత, దివ్య, నాగమణి, ప్రిన్సిపాల్ మారం వెంకటరమణారెడ్డి, ప్రేమ్ సాగర్, హాస్టల్స్ డైరెక్టర్ దోమల రమేశ్, ప్లేస్‌మెంట్ సెల్ అధికారిణి ప్రశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలకు రక్తహీనతపై అవగాహన

త్రిపురారం : అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి

మిర్యాలగూడ రూరల్/నిడమనూరు/త్రిపురారం/చందంపేట, మార్చి15 : కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ గాంధీనగర్ సెక్టార్ హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం అవగాహన కల్పించారు. అలాగే నిడమనూరు మండలం ముకుందాపురం సెక్టార్ పరిధిలోని పార్వతీపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ బీ-పఢాయిబీ కార్యక్రమానికి సీడీపీఓ గంధం పద్మావతి హాజరయ్యారు. త్రిపురారం మండలంలోని కంపసాగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చిరుధాన్యాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అవగాహన కల్పించారు. చందంపేట మండలంలోని తెల్దేవర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలోనూ పోషణ పక్షోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు అంకతి రుక్మిణి, మనోహరమ్మ, రుణ, ధనమ్మ, నాగమణి, శారద, విజయలక్ష్మి, నీలా, చంద్రకళ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల సవరణ

తిప్పర్తి, మార్చి 15 : ప్రజాపాలన దరఖాస్తుల్లో గృహజ్యోతి పథకం వర్తించని వారికి ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో సవరణ చేసే ప్రక్రియను శుక్రవారం ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఇప్పటివరకు మండలంలో 450 వరకు దరఖాస్తులు సవరించినట్లు ఆయన తెలిపారు.

శివాజీ నాయక్‌కు నివాళి

నాగార్జున సాగర్, మార్చి15 : పెద్దవూర మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముడావత్ శివాజీ నాయక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శివాజీనాయక్ మృతదేహానికి శుక్రవారం నాగార్జున సాగర్ హిల్‌కాలనీలోని ఆయన స్వగృహంలో ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, పెద్దవూర జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి అఖిలబారత బంజార సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావునాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేటి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

రామగిరి, మార్చి 15 : రాజీ పడదగిన కేసులను సత్వరం పరిష్కరించునేందుకు చక్కటి వేదిక లోక్ అదాలత్ అని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.నాగరాజు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి అన్నారు. నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో ఈ నెల 16న జిల్లాలోని 14 కోర్టుల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కక్షిదారుల సౌకర్యార్థం దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాల్లో 13,497 కేసుల పరిష్కారానికి అవకాశం ఉందని, అందులో 3,330 కేసులు పరిష్కరించారని, ఇంకా 10,167 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు తిరిగి అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దామరచర్ల/నకిరేకల్/కట్టంగూర్/త్రిపురారం, మార్చి 15 : మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి బాలాజీనాయక్ తెలిపారు. మండలంలో 538 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. నకిరేకల్ మండల కేంద్రంలో 4 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి ఎం. నాగయ్య తెలిపారు. కట్టంగూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, సాందీపని, గీతాంజలి పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ మేక నాగయ్య తెలిపారు. త్రిపురారం మండల పరిధిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, మండలంలో 394 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఎంఈఓ బాలాజీనాయక్ పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కట్టంగూర్‌లో గాలికుంటు టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ముత్తి లింగయ్య

మిర్యాలగూడ రూరల్/కట్టంగూర్/మార్చి15 : ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేస్తుందని, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు వెంకట్ రెడ్డి కోరారు. మండలంలోని గోగువారిగూడెంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అలాగే కట్టంగూర్ పశు వైద్యశాలలో గాలికుంటు టీకా కార్యక్రమాన్ని ఎంపీపీ జెల్లా ముత్తి లింగయ్య ప్రారంభించారు. కట్టంగూర్ మండలంలోని మునుకుంట్లలో పరడ పశువైద్యాధికారి శ్రావణి పశువులకు గాలికుంటూ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీటీసీ మాద యాదగిరి, పశు వైద్యాధికారి నాయిని దుర్గా రమాదేవి, బిక్యానాయక్, వెటర్నరీ డాక్టర్ అనుదీప్, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

నార్కట్‌పల్లి, మార్చి 15 : మండలంలోని వెంకటేశ్వర్ల బావి గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా తమ పాత్రలను పోషించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీను పాల్గొన్నారు.

గంజాయి మత్తులో గ్యాంగ్ వార్

విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

- స్నేహితుల మధ్య చిచ్చు పెట్టిన గంజాయి
- ఏడుగురు యువకుల అరెస్టు

నీలగిరి, మార్చి 15 : వారిద్దరూ ప్రాణ స్నేహితులు. ఒకరంటే మరొకరికి అమితమైన ప్రేమ. వారి పనులను కలిసి చేసుకుంటారు. కొంతకాలం తరువాత వారికి గంజాయి అలవాటైంది. ఇద్దరు కలిసే సేవించి విక్రయించేవారు. చివరికి అ గంజాయే ఇద్దరి మధ్య చిచ్చు పెట్టి ప్రాణాలు తీసుకునేలా చేసింది. గంజాయి విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఒకరిపై మరొకరు కత్తులతో దాడులు చేసుకున్నారు. పోలీసులకు చిక్కి కటాకటాల పాలయ్యారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలోని రాక్‌హిల్స్ కాలనీలో జరిగింది. ఇరువర్గాలకు చెందిన పదకొండు మంది యువకులపై కేసు నమోదు కాగా ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన మేడబోయిన చక్రి, ఎలిశాల అఖిల్ స్నేహితులు. వీరికి గత కొంతకాలంగా గంజాయి అలవాటు కావడంతో చక్రి దూల్‌పేట నుంచి గంజాయి కొనుగోలు చేసి మిత్రులతో కలిసి సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయించే వాడు గత జనవరిలో చక్రి వద్ద గంజాయి పట్టుబడడంతో కేసు నమోదైంది. దీనికి తన స్నేహితుడు అఖిలే కారణమని అతడే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు అనుమానంతో కక్ష పెంచుకున్నాడు. పలుమార్లు ఒకరికొకరు పరస్పరం దూషించుకోవడమే కాకుండా ఎవరికి వారు గంజాయి ముఠాలను ఏర్పాటు చేసుకున్నారు. తరచూ గంజాయి సేవిస్తూ సెల్‌ఫోన్‌లో తిట్టుకునే వారు. దీంతో వారి మధ్య దూరం మరింత పెరిగింది.

ఎలాగైనా అంతం చేయాలనే ఉద్దేశంతో..

తనను పోలీసులకు పట్టించిన అఖిల్‌ను ఎలాగైన అంతం చేయాలని కక్ష పెట్టుకున్న చక్రి ఈ నెల 9న తన బ్యాచ్‌తో కలిసి అఖిల్ ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డాడు. దీనికి ప్రతికారంగా అఖిల్ కూడా తన బ్యాచ్‌తో కలిసి చక్రి ఇంటిపైకి వెళ్లి గొడవపడ్డాడు. దీంతో మరింత రెచ్చిపోయిన చక్రి మరుసటి రోజు గ్రీన్‌హిల్స్ కాలనీ వెనుక భాగంలో తన బ్యాచ్‌కు చెందిన మహ్మద్ సమీర్, దోటి ఉపేందర్, కందికట్ల అభిరామ్, గజ్జి హర్షవర్ధన్, వట్టికోట శేఖర్, కొమ్మనపల్లి మహేశ్‌తో కలిసి గంజాయి సేవించి మత్తులో అఖిల్‌ను చంపుతానంటూ ఫోన్‌లో బెదిరించారు. అప్పటికే మత్తులో ఉన్న అఖిల్ కూడా తన బ్యాచ్‌కు చెందిన సురారపు రాజుకు చెప్పగా అతడు తన వెంట నవనీత్, షోయబ్ అనే మరో ఇద్దరితో కలిసి కత్తులను తీసుకుని అఖిల్‌తో కలిసి చక్రి ఉన్న ప్రదేశాలకు వెళ్లారు. ఈక్రమంలో ఇరువర్గాలు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దోటి ఉపేందర్‌తోపాటు సురారపు రాజుకు తీవ్రగాయాలు కాగా చక్రికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ సంఘటనలో ఇరువర్గాల నుం వచ్చిన ఫిర్యాదుల మేరకు రెండు బ్యాచ్‌లకు చెందిన 11 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పదకొండుమందిలో రాజు, ఉపేందర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అఖిల్, షోయబ్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈస మావేశంలో నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ కుమార్, ఎస్ఐ రావుల నాగారాజు తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client intends to purchase agriculture land to an extent of 2 Acres from Mekala Rajashekar Reddy S/o. Mekala Laxma Reddy GPA holder of Bhuvi Homes Pvt Ltd and an extent of Ac 15-28 guntas in Survey No. 219/6 of Nemaragomula Village, Bibinagar Mandal, Yadadri-Bhuvanagiri District, Telangana from **BHUVI HOMES PVT LTD** represented by its Managing Director Naveen Kongara S/o. Shanker Kongara by way of part purchase/development.
If any person or persons having any right, title, claim or interest in and over the said property, may contact the undersigned with relevant documents within **7 days** from the date of publication of this notice, otherwise my client will proceed with the registration of Sale Deed / Development Agreement in its favour. Thereafter any objections or claims or whatsoever shall not be entertained.
Sd/- **G.V.MALLIKHARJUNA RAO**
Advocate
S.R.T. 270, SANATHNAGAR
HYDERABAD
CELL: 9866137083

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

కావలెను
TS RTC కోదాడ మరియు మిర్యాలగూడ డిపోలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఎలక్ట్రీషియన్ మరియు వెల్డర్ కావలెను. అర్హత టెన్త్ క్లాస్ మరియు ఐటిఐ, జీతం+EPF and ESI కలదు. Cell: 7730805327.

FLAT FOR SALE
★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NLG-NT-327957

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

CHANGE OF NAME
★I, SYED ASIA SIDDIAQUA (Old Name), R/o. H.No. 4-2-68, Panjasha, Masjid e Gadi, Nalgonda Town Dist., TS. Changed My Name as SAYYIDA AYESHA SIDDIQUA (New Name), W/o. Syed Amjad Hussain. NT-328407
★I, Md YUSUF ALI (Old Name), R/o. H.No. 5-12-74/A, Rahmath Nagar, Nalgonda Town Dist., TS. Changed My Name as MOHAMMED YOUSUF ALI (New Name), S/o. Mohammed Yakub Ali. NT-328407
★I, SUMAYYA AFREEN, R/o. H.No. 5-9-153, Manyamchalka, Nalgonda Town Dist., TS. Changed My Minor Daughter Name from SANOWBER to SANOWBER FATIMA (New Name), D/o. Mohammed Ilyas Ali. NT-328407

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638